www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 27 జూన్ 2023

5

పశ్చిమ గోదావరి



ఒకే కాన్పులో ముగ్గురు జననం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



పెంటపాడు మండలం కస్పా పెంటపాడు గ్రామానికి చెందిన ఉప్పాడ చినతల్లి (25) మొదటి కాన్పులోనే ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది. వారిలో ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగ బిడ్డ ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం నొప్పులు రావడంతో 108 వాహనంలో ఆమెను తాడేపల్లిగూడెం తులసి నర్సింగ్ హోమ్‌కు తరలించారు. అక్కడ డాక్టర్ సిజేరియన్ చేసి ప్రసవం చేయగా ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. ముగ్గురు పిల్లలు ఆరోగ్యంగానే ఉన్నారని వైద్యులు తెలిపారు. చినతల్లి భర్త రాము పెయింటర్. చినతల్లి, రాము దంపతులు ఇరువురూ వికలాంగులే.

తిలకం దిద్దుతూ.. హారతులిస్తూ..!

'పోలవరం పోరుకేక' యాత్రకు జిల్లాలో ఘనస్వాగతం

భారీగా తరలొచ్చిన నాయకులు, కార్యకర్తలు, నిర్వాసితులు

సంఘీభావం ప్రకటించిన టిడిపి, జనసేన నాయకులు

తొలిరోజు ఐదు గ్రామాల మీదుగా 12 కిలోమీటర్ల పాదయాత్ర

ప్రత్యేక ఆకర్షణగా యువతీ యువకులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, వేలేరుపాడు, కుక్కునూరు, బుట్టాయగూడెం

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా సిపిఎం చేపట్టిన 'పోలవరం పోరుకేక' మహా పాదయాత్ర సోమవారం మధ్యాహ్నం జిల్లాలోకి ప్రవేశించింది. ఈ నెల 20న అల్లూరి సీతారామరాజు జిల్లా నెల్లిపాకలో మొదలైన పాదయాత్ర సోమవారం మధ్యాహ్నం కూనవరం చేరుకుంది. అక్కడ నుంచి పాదయాత్ర బృందం పడవలపై గోదావరి దాటి జిల్లాలోని వేలేరుపాడు మండలం రుద్రమ్మకోట గ్రామంలోకి ప్రవేశించింది. పాదయాత్ర బృందానికి సిపిఎం రాష్ట్ర నాయకులు వి.వెంకటేశ్వర్లు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి, సిపిఎం జిల్లా కార్యదర్శి రవి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, నిర్వాసితులు స్వాగతం పలికారు. మహిళలు ఎదురెళ్లి పూలమాలలు వేసి బొట్టు పెట్టి హారతులిచ్చి నేతలకు స్వాగతం పలికారు. అనంతరం రుద్రమ్మకోట గ్రామంలో బహిరంగ సభ ఆ మండల నాయకులు ధర్మల రమేష్, మడిది దుర్గారావు ఆధ్వర్యాన సాగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ మండలాన్ని యూనిట్‌గా గుర్తించి నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతేడాది ముంపు గ్రామాలన్నింటినీ సర్వేలో కలపాలని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో దీక్షలు చేస్తే 13 గ్రామాలను కలిపామని చెప్పి రెండు నెలల తర్వాత ముంపులో లేవంటూ నిర్వాసితులను మోసం చేశారన్నారు. ఎ, బి, సి బ్లాక్‌లతో సంబంధం లేకుండా ముంపు గ్రామాలకు పరిహారం ఇవ్వాలని కోరారు. టిడిపి మండలాధ్యక్షుడు అమరవరపు అశోక్, జనసేన మండలాధ్యక్షులు గణేశ్ ఆదినారాయణ మాట్లాడుతూ పోలవరం పోరుకేక యాత్రకు తమ పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. నిర్వాసితుల సమస్యలు అనేకం ఉన్నాయని, ప్రభుత్వం పట్టించుకోవడంలేదని చెప్పారు. సిపిఎం ఎన్నో కష్టాలు ఓర్చి నిర్వాసితుల కోసం ఈ పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. నిర్వాసితులంతా ఒక్కటై ముందుకు సాగాలన్నారు. అనంతరం పాదయాత్ర బృంద నాయకుడు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులను ప్రభుత్వం నిలువునా ముంచేసేందుకు పూనుకుందన్నారు. ప్రతి ఇంట్లోనూ, ప్రతి గ్రామంలోనూ సమస్య ఉందన్నారు. అంతా కలిసికట్టుగా పోరాడితేనే ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. వచ్చే నెల నాలుగో తేదీలోపు సమస్యల పరిష్కారంపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే ప్రతి ఊరునూ సమరక్షేత్రంలా మార్చి ఉద్యమించేలా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. పాదయాత్ర బృందం భోజన విరామం అనంతరం యాత్ర కొనసాగించింది. రుద్రమకోట, మద్దిగట్ల, వసంతవాడ, ఆర్వోపల్లి మీదుగా కుక్కునూరు మండలం దాచారం చేరుకుని రాత్రి బస చేసింది.

గిరిజనులపై యుద్ధం ప్రకటించిన బిజెపి

లోకనాథం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

పాదయాత్ర బృందం వసంతవాడ చేరుకున్నాక అక్కడ సభ నిర్వహించారు. అలసిన పాదయాత్ర బృందానికి ప్రజానాట్యమండలి కళాకారులు నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ ఉత్సాహం నింపారు. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం మాట్లాడుతూ బిజెపి వచ్చాక గిరిజనులపై యుద్ధం ప్రకటించిందన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు చట్టప్రకారం పరిహారం ఇవ్వకుండా మోసగిస్తుందన్నారు. వైసిపి, టిడిపి 2013 భూసేకరణ చట్టం అమలు చేయడం లేదన్నారు. భూమికి భూమితోపాటు పునరావాసం, పరిహారం ఏ ఒక్కటీ ఇవ్వలేదన్నారు. 1/70 అటవీ హక్కుల చట్టంపై బిజెపి దాడి చేస్తుందన్నారు. టిడిపి, జనసేన నిర్వాసితుల పక్షాన ఉంటారో, లేదో చెప్పాలన్నారు. గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులోని ఏడు మండలాల ప్రజలను పాలకులు ముంచడం దారుణమన్నారు. ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిన వైసిపి కాలక్షేపం చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఏం చెప్పారు.. ఏం చేశారు అని అడగడానికే పోలవరం పోరుకేక అని అన్నారు.



పోరాటానికి సిద్ధంగా ఉండాలి..

వి.శ్రీనివాసరావు

వసంతవాడ సభలో నిర్వాసితురాలు మడకం అక్కమ్మ గ్రామంలోని నిర్వాసితుల సమస్యలపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. తమ గ్రామం ముంపులో ఉండగా 45.72 కాంటూరులో పెట్టారన్నారు. భూమికి భూమి, ఇల్లుకు ఇల్లు ఏదీ ఇవ్వలేదన్నారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ ఇదే సమస్య ఉందని, పోరాడటానికి అంతా సిద్ధంగా ఉండాలని చెప్పారు. స్థానిక ఎంఎల్ఎ ఉలుకు పలుకు లేని బాలరాజుగా ఉన్నారన్నారు. వరదల్లో దెబ్బ తిన్న బాధితులకు జగన్ రెండు కొవ్వొత్తులిచ్చి సరిపెట్టారని ఎద్దేవా చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా యువత

పోలవరం పోరుకేక యాత్రలో యువతీ యువకులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. పాదయాత్ర బృందంలో అత్యధికంగా 18 ఏళ్లు నిండిన యువతీ యువకులే ఉన్నారు. యువత ఉత్సాహంగా అడుగులు వేస్తుంటే నాయకులు మరింత ఉత్సాహంగా అడుగులు ముందుకు వేస్తున్నారు. దీంతో పాదయాత్ర ఉప్పెనలా ముందుకు సాగుతోంది.

డిపిఆర్‌పై కేంద్రం రాష్ట్రంతో ఆడుకుంటోంది

అమరవరపు అశోక్, టిడిపి నాయకులు



పోలవరం నిధులపై రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిన డిపిఆర్‌పై కేంద్రం ఆడుకుంటోంది. దీనికి వైసిపినే ప్రధాన కారణం. నిర్వాసితుల సమస్యలు చాలా అలానే ఉన్నాయి. లక్ష కుటుంబాలకుపైగా ఉన్న నిర్వాసితుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణం కూడా చేయలేదు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి అంటూ విడదీసి వివక్ష ప్రదర్శిస్తున్నారు. నాలుగేళ్లుగా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంది. యువతకు సంబంధించి కటాఫ్ తేదీ పెంచలేదు. సిపిఎం పాదయాత్రకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాం.

నిర్వాసితులంతా ముక్తకంఠంతో చేయిచేయి కలపాలి

గణేష్ ఆదినారాయణ జనసేన నాయకులు



సిపిఎం పాదయాత్రకు అంతా సంఘీభావం తెలపడంతో పాటు నిర్వాసితులంతా ముక్తకంఠంతో చేయి చేయి కలపాలి. ఈ ప్రభుత్వం పునరావాస ప్యాకేజీ రూ.10 లక్షల హామీ గాని, భూములకు ఇస్తానన్న రూ.5 లక్షల పరిహారం ఏ ఒక్కటీ ఇవ్వలేదు. నాలుగేళ్లలో ఇళ్ల నిర్మాణం గాని, వసతులుగాని కల్పించలేదు. గోదావరి వరద సమయంలో దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం ఇవ్వలేదు. నిర్వాసితుల కోసం సిపిఎం చేస్తున్న పాదయాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువే.

ప్రతియేటా ఈ బాధలు పడలేం

బురదరాజు రాములమ్మ, రుద్రమ్మకోట



ప్రతియేటా వచ్చే గోదావరి వరదలకు ఇల్లు మునగడంతో సామాన్లను ఇళ్లలోనే వదిలి కట్టుబట్టలతో వెళ్లాల్సి వస్తుంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మాకు వచ్చే పునరావాస పరిహారం, ఇంటి పరిహారం ఇచ్చి మాకు కేటాయించిన ఇళ్లలోకి తరలించాలి. గతేడాది వచ్చిన వరదలకు నా ఇల్లు పూర్తిగా పడిపోయింది. ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం ఇవ్వలేదు.

మూడు నెలలు వయస్సు తగ్గిందన్నారు

పూజారి నాగమణి, రుద్రమ్మకోట



నా కుమారునికికి 18 సంవత్సరాలకు మూడు నెలల వయస్సు తగ్గిందని అధికారులు సర్వేలో నమోదు చేయలేదు. ఎంత బతిమాలినా పరిహారం రాదని అధికారులు ఖరాఖండీగా చెప్పారు. ప్రస్తుతం నా కుమారుడి వయస్సు 25. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 18 సంవత్సరాలు నిండిన వారి జాబితాలో నా కుమారుడి పేరు చేర్చి పరిహారం ఇవ్వాలి.

ఎన్నికల నిర్వహణపై అవగాహన అవసరం

భీమవరం: ఎన్నికల నిర్వహణకు సంబంధించి విధివిధానాలపై సంబంధిత అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జైలులో శిక్ష అనుభవిస్తున్న వారికి దగ్గరలో ఓటు నమోదు చేయాలని, ఓటు ఉన్నవారివి అక్కడకు బదిలీ చేయాలని సూచించారు. కుటుంబం అంతా ఒకేచోట ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా అపార్టుమెంట్లలోకి వచ్చినప్పుడు వారందరికీ ఓట్లున్నాయా, లేదా సరిచూసుకోవాలని ఓటు లేకపోతే ఫారం-6 ద్వారా నమోదు చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పోలింగ్ బూత్‌లన్నీ పరిశీలించి ఏదైనా పోలింగ్ బూత్ మార్చాలనుకుంటే ప్రతిపాదనలు పంపాలన్నారు. ప్రతి ఓటరూ రెండు కిలోమీటర్లలోపు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌లు పరిశీలించేటప్పుడు, ఎన్నికల సమావేశాలు నిర్వహించేటప్పుడు వివిధ రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానించాలన్నారు. పోలింగ్ బూత్‌లకు పటిష్టమైన గోడలు, తలుపులు, కిటికీలు, విద్యుత్, మరుగుదొడ్లు, వికలాంగుల కోసం ర్యాంపులు తదితర మౌలిక సదుపాయాలు పక్కాగా పరిశీలించి నివేదికలు అందించాలన్నారు.



యువ లాయర్లకు ప్రోత్సాహం వైఎస్ఆర్ లా నేస్తం : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

వైఎస్ఆర్ లా నేస్తం యువ లాయర్లకు ప్రోత్సాహకరమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. తాడేపల్లి నుంచి ముఖ్యమంత్రి జగన్ వైఎస్ఆర్ లా నేస్తం కార్యక్రమాన్ని సోమవారం ఉదయం ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రశాంతి, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా న్యాయవాద వృత్తిలోకి వచ్చే యువ న్యాయవాదులకు వైఎస్ఆర్ లా నేస్తం ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు. యువ న్యాయవాదులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మరింతగా వృత్తిలో రాణించాలని కోరారు. జిల్లాలో లా నేస్తం ద్వారా గత మూడేళ్లలో 173 మందికి ప్రయోజనం చేకూరిందన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుండి మే వరకు నాలుగు నెలల కాలానికి 68 మందికి రూ.ఐదు వేలు చొప్పున రూ.13.60 లక్షలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు. కార్యక్రమంలో యువ న్యాయవాదులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'జగనన్న సురక్ష'

కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - కాళ్ల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేయడానికి అందరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జక్కరంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో వాలంటీర్లు చేపట్టిన ఇంటింటా సర్వేను ఆమె సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే ఏ విధంగా చేస్తున్నారు, ఇప్పటికి ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి, ఏఏ సమస్యలపై ప్రజల నుండి వినతులు వచ్చాయని ఆమె అడిగి తెలుసుకున్నారు. స్వయంగా కొన్ని ఇళ్లను సందర్శించి వాలంటీర్ల సర్వేను కలెక్టర్ పరిశీలించారు. సిబ్బందికి పలు అంశాలపై ఆమె దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ అర్హతుండి పథకం అందని వారు ఒక్కరూ ఉండకూడదనే లక్ష్యంతో జగనన్న సురక్షను ప్రవేశ పెట్టారన్నారు. ప్రజలు విన్నవించిన ప్రతి సమస్యకూ కచ్చితంగా పరిష్కారం చూపించాలన్నారు. సర్వేలో ఒక్క ఇల్లు కూడా మిస్ కాకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి కె.కిషోర్‌కుమార్, గ్రామ సర్పంచి కూచంపూడి పద్మావతి, తహశీల్దారు టి.కృష్ణారావు, ఎంపిడిఒ జి.స్వాతి, విఆర్‌ఒ గనిశెట్టి సుధాకర్, గ్రామ కార్యదర్శి ఎస్‌కె.జమాల్, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికలు చాలా కీలకం

జనసేన అధినేత పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి - నరసాపురం/పాలకొల్లు

రాబోయే ఎన్నికలు జనసేనకు చాలా కీలకమని, ప్రతిఒక్కరూ కష్టపడి పార్టీ విజయానికి కృషి చేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. నరసాపురంలోని రాయ్‌పేటలో సోమవారం ఆయన నియోజకవర్గంలోని పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలోకి మీడియాను అనుమతించలేదు. సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్‌తోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు. జనసేన కార్యకర్తలు పట్టణంలో మోటార్ సైకిళ్లపై హల్‌చల్ చేశారు.



మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్

మాదకద్రవ్యాల నిరోధానికి సమిష్టి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

మాదకద్రవ్యాల నిరోధానికి కలిసికట్టుగా పని చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ 'మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా' వ్యతిరేక దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జువ్వలపాలెం రోడ్డులోని బార్కస్ హోటల్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ఏర్పాటు చేసిన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. జీవితం ఆనందమయం కావాలంటే ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. దేశ భవితకు ఆయువుపట్టుగా, బలమైన శక్తిగా నిలవాల్సిన యువత ఆల్కహాల్, మాదక ద్రవ్యాల మత్తులో తమ శక్తి సామర్థ్యాలను నిర్వీర్యం చేసుకుంటోందన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ వినియోగించినట్లు తెలిస్తే వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని తమ భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు.



ర్యాలీలో కలెక్టర్, ఎస్‌పి

వినియోగించినా.. రవాణా చేసినా కఠిన చర్యలు

జిల్లా ఎస్‌పి.యు.రవిప్రకాష్


నిషేధిత మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ అన్నారు. మాదకద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తులో నేరాలు చేసి సమాజంలో నేరస్తులుగా మారవద్దని సూచించారు. డ్రగ్స్ వాడినా, రవాణా చేసినా చట్టప్రకారం కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. కొందరు యువతను కావాలని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఇబి అడిషనల్ ఎస్‌పి ఎటివి.రవికుమార్, డిఎంహెచ్‌ఒ డి.మహేశ్వరరావు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలన్నీ చిత్తశుద్ధితో పరిష్కరించాలి

డిఆర్‌ఒ కృష్ణవేణి

ప్రజాశక్తి - భీమవరం

వివిధ సమస్యలపై స్పందనలో దరఖాస్తు చేసుకున్న అర్జీదారుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమస్యలు పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజలు అందించిన 189 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ స్పందన దరఖాస్తులు మళ్లీ రీఓపెన్ కాకుండా కచ్చితమైన పరిష్కారం చూపాలన్నారు. సుదూర ప్రాంతాల నుండి మన మీద నమ్మకంతో సమస్యల పరిష్కారానికి వస్తారని, దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు త్వరితగతిన పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జివికె.మల్లికార్జునరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, డిఎస్‌పి బి.శ్రీనాథ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, వయో వృద్ధుల ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న డిఆర్‌ఒ

తాడేపల్లిగూడెం: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి సూచించారు. ఎపి నిట్ ప్రాంగణంలోని పరిపాలనా భవనం వద్ద అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తుపదార్థాలు విద్యార్థుల పాలిట కాలకూట విషంగా పరిణమిస్తున్నాయని చెప్పారు. ముందుగా సిబ్బందితో రిజిస్ట్రార్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్, డాక్టర్ టి.కురుమయ్య, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ కిరణ్ తీపర్తి, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

భీమవరంలో పవన్ కళ్యాణ్ బస

నేడు ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జిలతో భేటీ

28న నరసాపురం కార్యకర్తలతో సమావేశం

జులైలో మరోసారి భీమవరం రాక

ప్రజాశక్తి - భీమవరం

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సోమవారం రాత్రి భీమవరం చేరుకున్నారు. పెదఅమిరంలోని నిర్మలాదేవి ఫంక్షన్ హాల్‌లో బస చేయనున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం నుంచి పశ్చిమగోదావరి జిల్లాలోకి ప్రవేశించిన వారాహి విజయ యాత్రలో భాగంగా నరసాపురంలో సోమవారం పార్టీ నేతలతోపాటు పలు సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం అక్కడే బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. అనంతరం నరసాపురం నుంచి రోడ్డు మార్గంలో మత్స్యపురి, తుందుర్రు, తాడేరు మీదుగా భీమవరం పట్టణానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నాచువారిసెంటర్, భీమేశ్వరస్వామి గుడి, ప్రకాశం చౌక్, జెపి రోడ్ మీదుగా పెదఅమిరంలోని నిర్మలాదేవి ఫంక్షన్ హాల్ చేరుకున్నారు. రాత్రి అక్కడ బస చేశారు. 27న ఉదయం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి నియోజకవర్గ ఇన్‌ఛార్జీల సమావేశంలో పాల్గొనున్నారు. 28న నరసాపురం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశం కానున్నారు. సమావేశం అనంతరం అదే రోజు మధ్యాహ్నం పవన్ ఇక్కడి నుంచి బయలుదేరి విజయవాడ వెళ్లనున్నట్లు సమాచారం.

వచ్చే నెలలో నాలుగు రోజులు భీమవరంలోనే

వారాహి యాత్రలో భాగంగా పవన్ కళ్యాణ్ జులైలో భీమవరంలో పర్యటించనున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. నాలుగు రోజులపాటు భీమవరంలోనే జనసేనాని బస చేయనున్నట్లు సమాచారం.

చేరికలకు ఛాన్స్

పవన్ కళ్యాణ్ సమక్షంలో పలువురు జనసేనలో చేరే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఆలిండియా తూర్పు కాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ జనసేనలో చేరడానికి సిద్ధమైనట్లు సమాచారం.

విద్యుత్ భారాలు ఉపసంహరించాలి

ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌కు వామపక్షాలు వినతి

ప్రజాశక్తి - భీమవరం

విద్యుత్ భారాల ఉపసంహరణ కోరుతూ వామపక్షాలు రాష్ట్రవ్యాప్త కార్యాచరణలో భాగంగా సిపిఎం, సిపిఐ, ఫార్వర్డ్ బ్లాక్, ఎంసిపిఐ నేతలు భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి, ఎంసిపిఐ జిల్లా నాయకుడు కెవివి.బ్రహ్మం విద్యుత్ భారాలను ఎంఎల్ఎకు వివరించారు. స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యుత్ భారాలు తొలగించాలని కోరుతూ ఈ నెల 28, 30 తేదీల్లో విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద ధర్నాలు నిర్వహించి, సంతకాల సేకరణ ఉద్యమాన్ని ప్రారంభిస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే విద్యుత్ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, మండల కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్, జిల్లా సమితి సభ్యులు ఎం.లక్ష్మీపతి, సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, నాయకులు ఎం.వైకుంఠరావు, ఫార్వర్డ్ బ్లాక్ డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



పెంటపాడులో..

పెంటపాడు: పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని వామపక్షాల పిలుపులో భాగంగా సిపిఎం ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, బంకురు నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపవరపు రంగారావు మాట్లాడుతూ 2020లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సవరణ బిల్లు రాష్ట్రంలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని, దీంతో విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు సత్తి కోదండరామిరెడ్డి, కరక వెంకట్రావు, బర్ల బాలాజీ, పాలపర్తి కృష్ణ, తెర్లి రాజేష్, మీసాల శ్రీనివాస్, దుర్గా, శిరపు మహేష్, దొర్ల సీతయ్య, గణేష్, శాంతి రాజు తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో..

పేదలకు పట్టాలు ఇచ్చేవరకూ పోరాటం

నిరసన దీక్షా శిబిరం ముగింపుసభలో ఎంఎల్ఎ నిమ్మల, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ గ్రామంలో దళిత బలహీన వర్గాల్లోని అర్హులైన వారందరికీ డి ఫారం పట్టాలు సాధించేవరకు పోరాటం ఆగదని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. లంక భూముల కోసం గత 20 రోజులుగా సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభకు సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు అధ్యక్షత వహించగా ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మట్లాడారు. చించినాడ పెరుగులంక భూముల్లోని మట్టిని వైసిపి నాయకులు దౌర్జన్యంగా తరలించి ఏ విధంగా సొమ్ములు చేసుకున్నారో వారి బండారం ప్రజలందరికీ బట్టబయలు చేశామన్నారు. అనేక నెలల పాటు సాగిన లంకల పోరాటంలో వందలాది మంది పేదలు ఎన్ని నిర్బంధాలు ఎదురైనా పోలీసులు దాడులను కూడా లెక్క చేయకుండా పోరాటంలో పాల్గొనడం వారి పోరాట స్ఫూర్తికి నిదర్శనమన్నారు. ఇదే పోరాటం లంక భూములను సాధించే వరకు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లంక భూముల పోరాట కమిటీ సభ్యులు గొల్ల ఏడుకొండలు, చెల్లుబోయిన వడ్డీకాసులు, కేతా రాము, మురాల రాజేష్, మురాల జైసింగ్, ఎం.ఆంజనేయులు, ఎస్.భాస్కరరావు, ఎం.రాజు, కె.వెంకటేశ్వరరావు, బి.శంకరుడు, ఐద్వా నాయకులు పాల్గొన్నారు.



ముగింపుసభలో మాట్లాడుతున్న రామానాయుడు, బలరాం

'పోలవరం పోరుకేక'కు అండగా నిలవాలి : సిపిఎం



భీమవరంలో మాట్లాడుతున్న జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

పోలవరం నిర్మాణం పూర్తి చేసి నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం చేపట్టిన పోలవరం పోరుకేకకు సంఘీభావం తెలపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ కోరారు. నిర్వాసితులకు, రైతులకు పోరుకేక పాదయాత్రకు అండగా విరాళాలు అందించి, సహాయం చేసి, ఆదుకుందామని పిలుపునిచ్చారు. భీమవరంలో పోరుకేక పాదయాత్ర సహాయనిధి సేకరణ కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆంజనేయులు, వైకుంఠరావు, వెంకటేశ్వరరావు, విద్యార్థి సంఘం నాయకులు పెద్దిరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

గణపవరం :సిపిఎం గణపవరం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మల్లపరాజుపేటలో పోలవరం పోరుకేక మహాపాదయాత్రకు సంఘీభావ నిధి క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పోలవరం నిర్వాసితులను ఆదుకోవాలన్నారు. పోలవరం నిర్వాసితులకు పునరావాస పరిహారం పూర్తిగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పెచ్చెట్టి నరసింహమూర్తి, కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, నరాలశెట్టి రామకృష్ణ, మేడిశెట్టి పెంటారావు పాల్గొన్నారు.

వీరవాసరం : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వం పునరావాసం, పరిహారం ఇవ్వాలంటూ సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోరుకేక మహా పాదయాత్రకు సంఘీభావంగా సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన విరాళాల సేకరణకు విశేషమైన మద్దతు లభిస్తుంది. వీరవాసరం, నవుడూరు గ్రామాల నుంచి రూ.7787 సమకూరినట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ పోతుల మృత్యుంజయ తెలిపారు. ఈ విరాళాల సేకరణలో సీనియర్ నేత జుత్తిగ నరసింహమూర్తి, కేతా జ్యోతిబసు, పాలాకోటేశ్వరరావు, యాళ్లబండి నారాయణమూర్తి, అయినంపూడి బాబురావు, రెడ్డి రామారావు, బి.సూర్యచంద్ర, శ్యాంబాబులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి - పెంటపాడు

స్థానిక జూనియర్ కళాశాలలో కనీస వసతులు కల్పించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం తాడేపల్లిగూడెం నియోజకవర్గ అధ్యక్షుడు పి.నాగేంద్ర మాట్లాడుతూ పెంటపాడు జూనియర్ కాలేజీలో మరుగుదొడ్లు సదుపాయం లేకపోవడం బాధాకరమన్నారు. నాడు-నేడు పనుల్లో ఇవి నిర్మిస్తున్నామని సంవత్సరం నుంచి నుంచి చెబుతున్నా ఇప్పటికీ పూర్తి కాలేదని, వాటిని తక్షణమే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు టి.రవిబాబు, శివ, దుర్గ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

భీమవరం :ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణికి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సోమవారం వినతిపత్రాన్ని అందించింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టల్ మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచి పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి టి.ప్రసాద్, య.వినోద్, బి.గణేష్, బి.చిరంజీవి, నాని, టి.శివమణి పాల్గొన్నారు.

ఇంటింటికి మంచినీటి కుళాయిలు

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కలవపూడి గ్రామంలో ఇంటింటికి మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. కలవపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ అధికారులతో, పైపులైను కాంట్రాక్టర్లతో ఎంఎల్ఎ రామరాజు సోమవారం సమావేశం నిర్వహించారు. తాగునీటి కుళాయిలు ఇప్పటివరకూ ఏర్పాటు చేయకపోవడానికి గల కారణాలను సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఆర్‌టిసి బస్సు సర్వీస్ (భీమవరం-కలవపూడి-మోడి) నిలిపివేశారని, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఎంఎల్ఎ రామరాజు దృష్టికి తీసుకెళ్లారు. భీమవరం డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సర్వీసు తిరిగి ప్రారంభించి విద్యార్థులకు సహకరించాలని కోరారు. తిరిగి ప్రారంభిస్తామని డిపో మేనేజర్ ఎంఎల్ఎకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి గ్రామ కార్యదర్శి ఎస్‌కె.జమాల్, టిడిపి కలవపూడి గ్రామ అధ్యక్షుడు నంబూరి త్రిమూర్తిరాజు, మాజీ ఉప సర్పంచి మంతెన వేణుగోపాలరాజు, ముదుండి బాబూరావు పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీని అధ్యయనం చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎప్పటికప్పుడు అందుబాటులోకి వస్తున్న నూతన టెక్నాలజీని అధ్యయనం చేస్తేనే ఉద్యోగాలను ప్లేస్‌మెంట్స్ దక్కుతాయని క్విక్ గ్లోబల్ సంస్థ సీనియర్ ఆఫీసర్, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ రాహుల్ దీక్షిత్ అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఆయన మాట్లాడుతూ నూతన టెక్నాలజీ వేగంగా మారుతున్న అంశాన్ని విద్యార్థులు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. నూతన టెక్నాలజీ ఎక్కడ అందుబాటులో ఉంటుందో అక్కడ అవసరమైతే ప్రాజెక్టులు చేసి ఆ టెక్నాలజీని అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ మాట్లాడుతూ ఆయా పరిశ్రమల నిపుణులు తమ అనుభవాలు చెప్పినప్పుడు ప్రతి విద్యార్థి దానిని పరిగణలోకి తీసుకుంటే ఎంతగానో భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ సెల్ డీన్ డాక్టర్ కెఆర్.సత్యనారాయణ మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ అందుకోవటం వల్లే సీనియర్స్ అత్యున్నత వేతనంతో ఉద్యోగాలు సంపాదించారన్నారు. విద్యార్థులకు నూతన టెక్నాలజీపై సూచనలు అందించిన రాహుల్ దీక్షిత్‌ను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎస్ఆర్‌కె నిశాంత్ వర్మ ఘనంగా సత్కరించారు.

న్యాయవాది కుటుంబానికి పలువురి పరామర్శ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు, యళ్లవానిగర్వులోని ప్రముఖ న్యాయవాది నాగబత్తుల నాగేశ్వరరావు (60) గుండె పోటుతో మృతి చెందారు. వారి కుటుంబాన్ని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు సోమవారం పరామర్శించారు. ఆయనతో పాటు డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కుంచిలపల్లి విన్‌స్టన్ బాబు, ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ మెంబర్ చెన్ను విజయ్, పాలకొల్లు నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ వడ్లపాటి ఆనంద్‌కుమార్, పాలకొల్లు బార్ అసోసియేషన్ అడ్వకేట్ పెచ్చెటి కష్ణాజీ, దేవా రాజేష్, కుమార్ నియోజకవర్గ దళిత నాయకులు పరామర్శించారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

ప్రజాశక్తి - గణపవరం

ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవని ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి అన్నారు. కాశిపాడు సచివాలయంలో సోమవారం నిర్వహించిన శానిటేషన్, వాటర్ హెల్త్ కమిటీ సమావేశం గ్రామ సర్పంచి కోట నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ జ్యోతిర్మయి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు పరిశుభ్రత, తాగునీటిపై అవగాహన కల్పించాలన్నారు. చెత్తాచెదారాలు వీధిలో వేయకుండా ఊరికి దూరంగా వేయాలని సూచించారు. స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు పారిశుధ్య నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పి.సత్యనారాయణ, పంచయతీ కార్యదర్శి ఆర్‌డి.రామారావు, ఆరోగ్య సహాయకులు నామాల రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ కె.హరినాథ్‌రాజు, సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం హర్షం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఉద్యోగుల సమస్యలపై ప్రతి నెలా మూడో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించాలని అన్ని స్థాయిల అధికారులకు వర్తించేలాగా జిఒ 1233 ఇవ్వడం పట్ల రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డికి రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదర్శ లయన్స్ క్లబ్‌కు పలు అవార్డులు

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక ఆదర్శ లయన్స్ క్లబ్‌కు ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన కార్యక్రమంలో పలు అవార్డులు దక్కాయి. క్లబ్ అధ్యక్షుడు ఎండి అహ్మద్‌కు భిన్నమైన ప్రత్యేక అవార్డు లభించింది. ఆయనకు లయన్స్ హంగర్ రిలీఫ్ పర్సన్ అంటూ ప్రత్యేక అవార్డును అందించారు. ఇటీవల నిడదవోలులో జరిగిన జిల్లా 316జి వార్షిక అవార్డుల ప్రదానోత్సవంలో ఆకివీడు ఆదర్శ లయన్స్ క్లబ్‌కు జిల్లా ద్వితీయ ఉత్తమ క్లబ్ గాను, నేరెళ్లరామ చెంచయ్యకు అప్రిషియేషన్, లయన్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ అప్రిసియేషన్ అవార్డును పల్లి అప్పిరెడ్డితో సహా అందరికీ లయన్స్ జిల్లా గవర్నర్ పంకజాక్షన్ అవార్డు అందించినట్లు అహ్మద్ తెలిపారు.

ఉండిలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - ఉండి

వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు చెప్పారు. ఉండి మూడో సచివాలయ పరిధిలో సోమవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిఎం జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు నూటికి 98 శాతం హామీలను నెరవేర్చి వాటిలో ఏమైనా సమస్యలు ఉన్నాయేమో తెలుసుకునేందుకు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఉప సర్పంచి గొట్టుముక్కల కల్యాణవర్మ, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, జెడ్‌పిటిసి సభ్యులు రణస్థుల కనకదుర్గ మహంకాళి, కార్పొరేషన్ డైరెక్టర్లు గులిపల్లి అచ్చారావు, కొత్రపాటి అనిత, నాయకులు గుండాబత్తుల సుబ్బారావు, బడుగు బాలాజీ, పాటూరి శ్రీనివాస దొరబాబు, అంగర రాంబాబు, శేషాద్రి శ్రీనివాస్, రాయి సతీష్ పాల్గొన్నారు.

శ్యామలరావుకు పిహెచ్‌డి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్‌కి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శ్యామలరావు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్‌డి పట్టా పొందారని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం తరపున శ్యామలరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్యామలరావు మాట్లాడుతూ కెఎల్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ పర్యవేక్షణలో తాను చేసిన పరిశోధనకు కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగంలో పిహెచ్‌డి ప్రదానం చేశారని చెప్పారు. ఈ సందర్భంగా శ్యామలరావును కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కె.సురేష్‌బాబు, ఐటి డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ బిహెచ్‌వి.రామకృష్ణంరాజు అభినందించారు.

మలేరియాపై వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - గణపవరం

మలేరియా మసోత్సవంలో భాగంగా గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్ విద్యార్థులకు సోమవారం మలేరియాపై వ్యాచరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్షణరావు, గణపవరం డాక్టర్ పి.కిరణ్మయి.మాట్లాడుతూ చలితో కూడిన జ్వరం ఉంటే వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాస రచన పోటీల్లో ఎం.నిఖిలశ్రీజకు ప్రథమ బహుమతి, ఎన్.అంబికకు రెండో బహుమతి, పి.మౌనికకు మూడో బహుమతి, డి.కీర్తనకు నాలుగో బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో హైస్కూలు ప్రధానోపాధ్యాయులు బాలభాస్కరరావు, సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు, హెల్త్ అసిస్టెంట్ ఎం.యేహను, జి.శ్రీనివాస్, ఎ.కృష్ణ, ఎన్.నల్లయ్య పాల్గొన్నారు.

పెదమల్లంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని పెదమల్లం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద తానా ఫౌండేషన్ గ్రేస్, క్యాన్సర్ ఫౌండేషన్ తాడేపల్లిగూడేనికి చెందిన ఆత్మబంధువులు సేవా సంఘం వారి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత స్కానింగ్ పరీక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచి దిరిశాల విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ శిబిరంలో డాక్టర్ శ్రీకాంత్ వైద్య పరీక్షలు నిర్వహించి, 108కి ఉచితంగా స్కానింగ్ టెస్టులు పరీక్షలు చేశారు. అనంతరం మెడికల్ కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సూపరింటెండెంట్ కడియాల పరశురామయ్య, వైస్ ప్రెసిడెంట్ తరువాళ్ల సూరిబాబు, సెక్రటరీ ఉషాకిరణ్, ఎన్.ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

చింతపర్రులో 'ఫ్యామిలీ డాక్టర్'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని చింతపర్రు గ్రామంలో సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో 75 మంది వ్యాధిగ్రస్తులకు డాక్టర్ ప్రతాప్ కుమార్ వైద్య పరీక్షలు చేశారు. బిపి, షుగర్ ఇతర వ్యాధిగ్రస్తులను, గర్భిణులను, బాలింతలను, కిశోర బాలికలను, బరువు తక్కువ గల పిల్లలను, రక్తహీనత గల వారిని పరీక్షించి మందులు అందించారు. అనంతరం అతిసార వ్యాధిపై, సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ సర్పంచి గుమ్మాపు పెద్దిరాజు మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి పెన్మత్స వెంకట కృష్ణంరాజు, ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, ఎంఎల్‌హెచ్‌పిలు కృష్ణవేణి, శ్రావణి, హెల్త్ అసిస్టెంట్ తారక్, డిఇఒ సురేష్, ఆశా కార్యకర్తలు శిరోమణి, రత్నకుమారి, అజిత, సరోజినీ పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ ఎఒను బదిలీ చేయాలని ధర్నా

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ధాన్యం కొనుగోలు సమయంలో రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన నరసాపురం మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.సామ్యూల్‌జాన్సన్‌ని వెంటనే బదిలీ చేయాలని కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కౌలురైతులు నరసాపురం సబ్ కలక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ వ్యవసాయ మండల అధికారి నిర్లక్ష్యంగా ఉంటే రైతాంగం తీవ్రంగా నష్టపోతారన్నారు. ఎఒను బదిలీ చేయాలని సబ్‌కలెక్టర్‌కి వినతిపత్రం అందించారు. తగు చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ చెప్పారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక బివి రాజు కళాశాలలోఅంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జాతీయ సేవా పథక విభాగం-1,2 ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా భీమవరం మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి పి.సత్యదేవి పాల్గొన్నారు. వీరితో పాటుగా భీమవరం డిఎస్‌పి బి.త్రినాథ్, భీమవరం బార్ అసోసియేషన్ సెక్రటరీ పి.రమేష్‌బాబు, భీమవరం లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎస్.సుధీర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐఆర్.కృష్ణంరాజు, వైస్ ప్రిన్సిపల్ సిహెచ్‌ఎస్‌వి.సత్యనారాయణ, వివిధ శాఖాధిపతులు, ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు పాలకొల్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో వారు సంయుక్తంగా ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సినల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, మాదకద్రవ్య వ్యతిరేక కమిటీ కో-కన్వీనర్ వంశీ, ఎస్ఇబి అధికారి చిరంజీవి, ఎఎస్ఐ మారిలింగం మాట్లాడారు.

ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమ వారం ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాలకొల్లు పట్టణ ప్రొహి బిషన్, ఎక్సైజ్ శాఖ సిఐ ఎల్.చిరంజీవి హాజరయ్యారు. కళా శాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహరావుచ ప్రిన్సిపల్ డాక్టర్ డి. వెంకటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు మా దక ద్రవ్యాల నియంత్రణలో యువత పాత్ర అన్న అం శంపై వ్యాసరచన పోటీలు నిర్వహంచి బహుమతులు అందించారు.

గణపవరం : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని గణపవరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం కాలేజీ ఆవరణలో విద్యార్థులకు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి.మధురాజు, లెక్చరర్లు టి.అక్కరాజు, చైతన్య, సిహెచ్.అనురాధ, ఎన్‌విఎన్‌బి.శ్రీనివాసరావు, జివి.రమణ, జివి.రావు, బి.రమేష్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్, అదనపు సెషన్స్ జడ్జి కె.ప్రకాష్‌బాబు, రెండో అదనపు సెషన్స్ జడ్జి ఇ.అన్నమణి పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు, ప్రశంసాపత్రాలను అందించారు.

నరసాపురం టౌన్ : నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వైఎన్ కాలేజీలో మాదక ద్రవ్యాల నివారణపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది, వైఎన్ కాలేజీ ట్రెజరర్ పిఎస్.రఘురామారావు ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నక్కా కుమార్ రత్నం, ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్, లైబ్రరీ కార్యదర్శి నారిన శ్రీనివాసరావు, ఉచిత న్యాయవాది నరసింహరాజు, కాలేజీ ప్రిన్సిపల్ అప్పారావు పాల్గొన్నారు.

ఆటోనగర్ రోడ్డు నిర్మాణానికి చర్యలు : మంత్రి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆదర్శ ఆటోనగర్‌లో రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. స్థానిక ఆదర్శ ఆటోనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బృందం సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మంత్రి కొట్టు సత్యనారాయణను కలిశారు. ఈ సందర్భంగా వారు ఆటోనగర్‌లో రోడ్డు నిర్మించాలని కోరారు. ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా వాహనాల రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఆటోనగర్‌లో రోడ్డు నిర్మాణం ప్రతిపాదన ఇప్పటికే ఉందని, త్వరలోనే ఈ రోడ్డు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. దీనిపై పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఉన్నతాధికారులతో ఆయన అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. వీలైనంత త్వరలోనే ఆటోనగర్ రోడ్డు నిర్మాణం చేపడతామని మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఆదర్శ ఆటోనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.నాగేశ్వరరావు, కార్యదర్శి ఆచంట దుర్గారావు, సభ్యులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి 'జగనన్న సురక్ష' : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రతి కుటుంబానికి ఏ ఒక్క సమస్య లేకుండా చూడడమే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. భీమవరం పురపాలక సంఘం పరిధి ఒకటో వార్డు మెంటేవారితోటలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వార్డు వాలంటీర్ల ఇంటింటా సర్వేను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఆయా పథకాలు అమలు చేయడం కోసం కచ్చితత్వంతో కూడిన పని తీరు చూపాల్సి ఉంటుందన్నారు. కలెక్టర్‌తో పాటు ఇన్‌ఛార్జి పురపాలక సంఘం కమిషనర్ కెటి.సుధాకర్, తహశీల్దార్ వై.రవికుమార్, సహాయ కమిషనర్ బి.జ్యోతిలక్ష్మి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి - ఆచంట

వృత్తి విద్యా కోర్సుల ద్వారానే ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, విద్యార్థులు తల్లిదండ్రులపై ఆధారపడకుండా ఈ కోర్సుల్లో చేరి ఉన్నత శిఖరాల అధిరోహించాలని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీ రంగనాథరాజు అన్నారు. ఆచంట ప్రభుత్వ ఐటిఐ కాలేజీలో ఎపిఎస్ఎస్‌సిడిసి నిధులు రూ.5.50 లక్షలతో పున:నిర్మించిన రెండు అదనపు తరగతి గదులను సోమవారం ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు ప్రారంభించారు. అనంతరం షార్ట్ టర్మ్ కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో శ్రీరంగనాథరాజు మాట్లాడారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల మీద ఆధార పడకుండా, వృత్తి విద్య కోర్సులు నేర్చుకుని, ఉన్నత స్థాయిలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వంరావు, ఎపి ఎస్ఎస్ డిసి జిల్లా డిఎస్‌డిఒ అన్నపురెడ్డి కృష్ణారెడ్డి, జిల్లా కన్వీనర్ గవర్నమెంట్ ఐటిఐ భీమవరం ప్రిన్సిపల్ వి.శ్రీనివాసరాజు, రామేశ్వర ఎడ్యుకేషన్ సొసైటీ ఆచంట సెక్రటరీ కడియాల పేరేశం, ఆచంట మండల ఎంపిటిసి సభ్యులు ఉల్లం జ్యోతి, గవర్నమెంట్ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ ఐవిఎస్ఎన్.రాజు, ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సీతారామం పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి : ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం నియోజకవర్గంలో అభివృద్ధిని చేసి చూపిస్తున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్పష్టం చేశారు. మండలంలోని రాయలం, కొమరాడ గ్రామాల్లో రూ.80 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులతో క్షేత్రస్థాయిలో ప్రజల కోరిక మేరకు, వారి సూచన మేరకు సిసి రోడ్లను నిర్మించినట్లు తెలిపారు. ఇంకా ఎక్కడైనా సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాల్సి ఉంటే ఆ ప్రాంత ప్రజలు ఆ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. రాయలం గ్రామంలో సిసి రోడ్డును ప్రారంభించిన ఆయన శిలాఫలకాలను విద్యార్థులు, వాలంటీర్లతో ఆవిష్కరిం పజేశారు. అనంతరం కొమరాడలో మహిళలతో రోడ్లను ప్రారంభింపజేశారు.

30న విజయవాడలో మహాధర్నా : రైతుసంఘం

ప్రజాశక్తి - తణుకు రూరల్

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 30వ తేదీన విజయవాడలో జరిగే మహాధర్నాకు రైతులందరూ తరలిరావాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని దువ్వ గ్రామంలో సోమవారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరేరామ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు, గ్రామ రైతులు దొంగల నాగేశ్వరరావు, బండారు వెంకటేశ్వరరావు, నీలం వెంకట బసవయ్య, గొడుపు సూర్యనారాయణ, మట్ట గణపతి, ముత్యాల వీరన్న, ఆలం ధనరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

పెనుగొండ : పంటలకు మద్దతు ధర, పంట నష్టపరిహారం, విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు పలు సమస్యలపై చలో విజయవాడకు తరలి రావాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి హరేరామ్ పిలుపునిచ్చారు. మండలంలో రైతులను ఆయన సోమవారం కలిసి మాట్లాడారు. ఈ నెల 30వ తేదీన విజయవాడ అలంకార్ థియేటర్ సెంటర్‌లో ధర్నా చౌక్ వద్ద జరిగే మహాధర్నాలో రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'స్పందన'కు 21 ఫిర్యాదులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి పలు సమస్యలపై 21 ఫిర్యాదులు అందాయని జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ తెలిపారు. ఈ ఫిర్యాదులను జిల్లాలోని ఆయా స్టేషన్లకు బదిలీ చేసి వాటిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

సిఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

గతేడాది స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో జెండా కర్ర కడుతూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన తమనంపూడి వీర వెంకటరెడ్డికి సిఎం సహాయ నిధిని అందించినట్లు కొయ్యేటిపాడు సర్పంచి కర్రిముని రామకృష్ణారెడ్డి తెలిపారు. ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు క్యాంపు కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా తమనంపూడి వీర వెంకటరెడ్డి భార్య చైతన్యశ్రీకి రూ.పది లక్షల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తమనంపూడి కోదండరామిరెడ్డి, దొంగ దుర్గాప్రసాద్‌రావు, మేడపాటి వీరవెంకటసత్యనారాయణ రెడ్డి, గుడిమెట్ల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం అగ్నిమాపక అధికారి వెంకట రామారావు అధ్వర్యంలో సోమవారం నుంచి మూడు రోజులపాటు ప్రత్తిపాడులో ఉన్న 3ఎఫ్ ఇండస్ట్రీలో బేసిక్ ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్‌పై శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ తరగతులకు తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో గల వివిధ పరిశ్రమలు, ఆసుపత్రులు, కళాశాలలు, పాఠశాలలకు చెందిన సిబ్బంది హాజరయ్యారు. ప్రారంభ కార్యక్రమానికి అతిథులుగా జిల్లా ముఖ్య అగ్నిమాపక అధికారి బి.శ్రీనివాస్, 3 ఎఫ్ ఇండస్ట్రీ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ జె.జనార్ధన్ పాల్గొని శిక్షణా తరగతుల ప్రాముఖ్యత గురించి అభ్యర్థులకు వివరించారు.

పిహెచ్‌సి డాక్టర్‌గా అనిల్‌కుమార్

ప్రజాశక్తి - పెనుమంట్ర

భట్టలమగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌గా ఉందుర్తి అనిల్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన డాక్టర్ ఎం.గంగునాయుడు విశాఖపట్నం జిల్లాకు బదిలీ అయ్యారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఉందుర్తి అనిల్‌కుమార్ ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజును తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు డాక్టర్ కొడాలి ప్రదీప్‌కుమార్, విజయ్‌కుమార్, పెద్దిరాజు, హాస్పిటల్ సిబ్బంది, వైసిపి సీనియర్ నాయకులు విశ్వనాథరాజు, వైసిపి నాయకులు ఉన్నారు.

భద్రతకు ప్రాధాన్యం

పాలకోడేరు:ఉద్యోగులు వినియోగదారులకు సేవలందిస్తూ భద్రతకు ప్రాధాన్యం తీసుకోవాలని విద్యుత్ పంపిణీ సంస్థ ఎఇ ఆర్‌ఒ.అప్పారావు అన్నారు. విద్యుత్ ఉద్యోగుల భద్రతా వారోత్సవాల్లో భాగంగా పాలకోడేరు విద్యుత్ ఉప కేంద్రం వద్ద సోమవారం సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లైన్‌మేన్ విద్యుత్ లైన్ల మరమ్మతుల సమయంలో ఎప్పటికప్పుడు లైన్ క్లీయర్ తీసుకోవాలన్నారు. ఇందు కోసం తోటి ఉద్యోగుల సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు.